# వీవెన

తెలిదేవర భానుమూర్తి




ఉదయం ఏడుగంటలైంది. అప్పుడే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోకి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ వచ్చింది. పెళ్లి వారిల్లులా రైల్వేస్టేషన్ సందడిగా వుంది. లగేజీతో ప్రయాణికులు రైలు నుంచి దిగుతున్నారు. ఎక్కువ లగేజి ఉన్నవారు పోర్టర్లను కుదుర్చుకుంటున్నారు. కొందరు నల్లా వద్దకు వెళ్లి మొహం కడుక్కుంటున్నారు. ఛాయ్, కాఫీ, ఇడ్లీ, వడా అనే కేకలు ప్లాట్‌ఫారం మీద నుంచి వినవస్తున్నాయి.

నేను ఓ పత్రిక ఆఫీసులో పనిచేస్తున్నాను. మా స్నేహితుడి పెళ్లి తిరుపతిలో ఉంటే వెళ్లి తిరిగి వచ్చాను. స్టేషన్ నుంచి బయటపడ్డాక ఎదురుగా ఉన్న ఓ హోటల్ కెళ్లాను. రైల్లోనే మొహం కడుక్కోవడంతో ఇడ్లీ తిన్నాను. కాఫీ తాగుతుండగా...

"లంజే! ఈడికెళ్లి బోతవా? రెండీమంటావా?" అనే తిట్టు వినిపించింది.

ఎవరా అని హోటల్ బయటికి చూశాను. చిరిగిన చీర, ముడతలు పడ్డ శరీరం, వంగిన నడుం, ఒక చేతిలో కర్ర, మరోచేతిలో అల్యూమినియం గిన్నెతో అడుక్కుంటున్న ఒక ముసల్ది కనిపించింది. ఎందుకో ఏమో ఆమె ఎదురుగా వున్న ఓ

## రాణీముఖర్జీకి గోవిందా భారీ గిఫ్ట్!

'కారులో షికారుచేద్దాం పాలబుగ్గల పసిడిదానా' అంటూ గోవిందా రాణీముఖర్జీకి 30 లక్షల రూపాయల విలువచేసే భారీ కారును గిఫ్ట్‌గా ఇచ్చాడట. ఇటీవల కాలంలో రాణీముఖర్జీ ఇంటికి తరచూ వస్తూ పోతున్నాడట గోవింద. వీళ్ల మధ్య ప్రేమ ముదిరి పాకాన పడినట్లుంది కాబోలు. అయినా హీరోయిన్లంతా పెళ్లయిన మగవాళ్లంటే అంత మోజెందుకు పడతారో...!

జె.



పద్దెనిమిదేళ్ల పిల్లను తిడుతున్నది. ఆ పిల్ల తెల్లగా బొద్దుగా వుంది. ఆమె కళ్లలో ఎదుటివాళ్లను రెచ్చగొట్టే చిలిపితనం వుంది. ఆ అమ్మాయి చక్కగా తలదువ్వుకొని వుంది. తెల్లటి జాకెట్టు, ఎర్రటి లంగావోణీలతో ఎదుటివాళ్లని తనవైపు తిప్పుకొనేలా వుంది. అరవుగ్గిన జాంవండులా అందరినీ ఊరించేలా ఉంది. విరిసిన పువ్వు వెదజల్లే పరిమళంలా వుంది. గలగల పారే సెలయేరులా ఉంది.

ముసల్ది తిడితే ఆ పడుచుపిల్ల చప్పుడు చేయకుండా ఊరుకోలేదు.

"గిది నీ తాత జాగీరనుకున్నావా?" అంటూ ముసల్దాన్ని గద్దించింది.

"ఎప్పటి సందో నేను గీ ఓటల్ ముంగట అడ్కదింటున్న. గియ్యాల్ల నువ్వు నా అడ్డాకు వొచ్చి నన్నే బెదిరిస్తున్నవా? కావురం గిన ఎక్కిందా?" అని ముసల్ది గట్టిగా అరిచింది.

"ఏయ్ ముసల్దానా! లాసిగ ఒర్లితె గీడ బుగులు బడేటోల్లు ఎవ్వలు లేరు. ఎవ్వలితోని జెప్పుకుంటవో జెప్పుకో పో" అని ఆ పిల్ల నిర్లక్ష్యంగా అంది.

"నీ నోట్లె నా ఉచ్చ. నీ తలపండు బల్గ. నీ దొడల్ దగ్గర బడ..." అంటూ ముసలి బిచ్చగత్తె తిట్ల వర్షం కురిపించింది.

"తిట్లు నీకే గాదు. నాగ్గూడ వొస్తయి. ముసల్ది గదా అని ఊకుంటుంటె ఇష్టమున్న తీర్గ ఒర్లుతున్నవు. సప్పుడు గాకుంట గూసో" అంటూ ముసల్దాన్ని వయసు బిచ్చగత్తె గద్దించింది.

"యాడికెల్లి వొచ్చినవే బద్మాష్ పోరీ! నువ్వు నోరుమూస్కో అంటె నేను నోరు మూస్కోవాలెనా? చిన్నంత్రం పెద్దంత్రం లేకుంట ఒర్లుతున్నవ్. మస్తిగిన ఎక్కిందా ఏంది?" అని ముసల్ది కోపగించింది.

"మస్తి ఎక్కింది. ఏం జేస్తవ్. కొడ్తవా? కొట్టు సూద్దాం" అని ఆ పిల్ల పెంకిగా అంది.

ఇలా వాళ్లిద్దరు తిట్టుకుంటున్నప్పుడే ఐదారుగురు హోటల్ నుండి బయటకు వచ్చారు. వయసు బిచ్చగత్తె వాళ్ల దగ్గరికెళ్లింది. ఒకతిని మీద దాదాపు పడబోయినంత పనిచేసింది. మరొకతనికి తన చేయి తాకించింది. ఇంకొకతనికి తన పైట తగిలేలా చేసింది.

"నిన్నటి సంది బువ్వ లేదు. ఆకలైతున్నది. ఒక రూపాయి దర్మం జెయ్యుండ్రి" అంటూ వాళ్ల ముందర చెయ్యి చాచింది. వాళ్లందరూ ఆమె చేతిలో డబ్బులుంచారు. డబ్బులేస్తూ వేస్తూ ఆమెను తాకి ఆనందించారు.

ముసలి బిచ్చగత్తె ఒక గోనెపట్టాపై కూచుని ఈ తతంగాన్నంతా చూసింది. ఆమెకు ఒళ్లు మండిపోయింది. కోపం కట్టలు తెంచుకుంది. ఉక్రోషం వచ్చింది.

"లంజే ఎవ్వనితానన్న పండకుంట గీడికొచ్చి నా నోట్లె మన్నెందుకు గొడ్తున్నవే?" అని అరిచింది.

"ముసల్దానా! వొల్లకు. వొర్లితె కుత్కెనొస్తది. అంబటాల్ల నీగ్గూడ నాస్త జేపిస్త తియ్యి. చాయ్ గూడ తాపిస్త తియ్యి. బేఫికర్గ బండుకో" అని వయసు బిచ్చగత్తె అంది.

అలా ఆమె అనడంతో ముసలి బిచ్చగత్తె రెచ్చిపోయింది.

"నీ చేతులిర్గ. నీకు పెద్ద రోగం దల్గ. నిన్ను గాడ్దులు.." అంటూ బూతులకు లంకించుకుంది.

"నువ్వు ఎంత గనం దిట్టినా, ఎంత గనం మొత్తుకున్న నేను గీడికెల్లిబోయే సవాల్ లేదు. నువ్వు ఏం జేస్కుంటవో జేస్కోపో!" అని ఆ పిల్ల అంది.

"సిగ్గుశరం లేనోల్లను తిడితేంది? కొడితేంది? నీకు నా అసుంటి అమ్మలేదా? మీ అమ్మ ఆకలితోని ఉంటె నువ్వు ఊకుంటవా?" అని ముసలి బిచ్చగత్తె అడిగింది.

"ఎందుకూకుంట. నీగ్గూడ నాస్త దినిపిస్తనని జెప్పిన గద. జెప్పినంక గూడ నువ్వే పుజూల్గ లొల్లి జేస్తున్నవు" అని వయసు బిచ్చగత్తె అన్నది.

"నువ్వు ఆకులను నాకితె నేను నీ మూతిని నాకాల్నా? నీకు సిగ్గుశరం లేకుంటె నాకు లేదనుకున్నవా?" అని ముసల్ది అడిగింది.

"అడుక్కునేటోల్లకు సిగ్గేంది? శరమేంది? గీ ఊరేంది? గా ఊరేంది? గీ జాగేంది? గా జాగేంది?" అని వయసు బిచ్చగత్తె ప్రశ్నించింది.

"వైసుల ఉన్నవు. మంచిగ కష్టం జేస్కోని బత్కకుంట గిట్ల అడ్కతింటుంటె బాగుంటదా? ఎవ్వలన్న మెచ్చుతరా?" అని ముసలి బిచ్చగత్తె అంది.

"నువ్వు వైసుల ఉన్నప్పుడు కూలి పనిగిన బోయినవా? బోలేదని నా కెర్కే. బిచ్చపోల్లకు బుట్టినోల్లు బిచ్చపోల్లు గాకుంటె కూలోల్లు అయితరా?" అని వయసు బిచ్చగత్తె నవ్వుతూ అడిగింది.

ఆమె నవ్వు ముసలి బిచ్చగత్తెను సూదుల్లా పొడిచింది. రాళ్లలా తాకింది.

టిఫిన్ చేసిన మరో ఇద్దరు హోటల్ నుంచి

బయటకు వచ్చారు. వయసు బిచ్చగత్తె ఎప్పటిలాగే వాళ్ల వద్దకు వెళ్లింది. హోయలూ, ఒయ్యారమూ ఒలకబోసింది. క్రీగంట చూస్తూ చిలకలా నవ్వింది. చిలిపిగా చూసింది. పైట సర్దుకుంది. ఆ ఇద్దరూ ఆమెకేసి తదేకంగా చూస్తూ నిలబడిపోయారు. ఇదే సరైన సమయమనుకొని "ఆకలైతున్నది. ఒక రూపాయి దర్మం జెయ్యుండ్రి" అని ప్రాధేయపడుతూ అడిగింది.

వాళ్లిద్దరూ ఆమెకు ఐదురూపాయలిచ్చారు. ఇస్తూ ఇస్తూ ఒకడు ఆమె కేసి చూస్తూ వెకిలిగా నవ్వితే మరొకడు ఆమె చేతిని తాకాడు.

"లంజకతలు బడుక్కుంట అడుక్కునుడు యాడ నేర్సుకున్నవే?" అని ముసల్ది ఉక్రోషంతో అడిగింది.

"నీ అసుంటి దానితాన్నే" అని వయసు బిచ్చగత్తె అంది.

"బగ్గ కావురం ఎక్కింది. నీ బొక్కలిరగ్గొడ్త" అంటూ ముసలి బిచ్చగత్తె లేచి నిలుచుంది. నిలుచుని తన చేతిలో ఉన్న కట్టెతో వయసు బిచ్చగత్తెను కొట్టబోయింది. కానీ ఆమె కొట్టే లోపల వయసు బిచ్చగత్తె దూరంగా పారిపోయి ఆమెను వెక్కిరించింది. ముసల్ది సణుక్కుంటూ కూచుంది. ఆమె కూచోగానే వయసు బిచ్చగత్తె మళ్లీ హోటల్ ముందుకొచ్చి అడుక్కోసాగింది.

ఈ తతంగాన్నంతా మొదటి నుంచి చూస్తున్న నాకు బాధ వేసింది. ముసలి బిచ్చగత్తె పై జాలి, వగలిమారి వయసు బిచ్చగత్తెపై పట్టరాని కోపం కలిగింది. దానికి బుద్ధి లేకపోతే పోయింది. ఈ జనాలకు ఎందుకు బుద్ధి లేదో. కాస్త ఎర్రగా బుర్రగా కనిపించి ఓ నవ్వు నవ్వితేచాలు. రూపాయలిస్తారు. కానీ లేవలేని స్థితిలో బతుకును భారంగా ఈడుస్తున్న ఆ ముసలి బిచ్చగత్తెమీద ఎవరూ జాలి చూపరు. పైసా కూడా విదల్చరు. ఇదేం న్యాయం? ఇదేం మానవత్వం? అనే ప్రశ్నలు నాలో ఉదయించాయి. బాగానే వుంది. మరి నువ్వో? అంతరాళాల్లోంచి సంధించిన బాణంలా ప్రశ్న దూసుకొచ్చింది. జనాలనంటున్నాను కానీ నేనూ వారిలాటి వాడినే, మా అమ్మానాన్నా ముసలివాళ్లు. వాళ్లిద్దరే మా ఊర్లో మా సొంత ఇంట్లో ఉంటున్నారు. నేను పంపే రూపాయలే వారి జీవనాధారం. వారం రోజుల క్రితం మాఅమ్మ నుంచి నాకో ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం ఇలా ఉంది.

యాద్గిరికి మీ అమ్మ రాసేడ్ది

ఈడ మేము మంచిగున్నం. ఆడ నువ్వు కోడలు, మన్మడు మంచిగున్నరనుకుంట. నువ్వు బంపిచ్చేటి పైసలు మాకు ఒక్కపూట బువ్వకు గూడ సాల్తలేవు. పట్నంల నీకు కర్సులెక్వ ఉంటయని ఎర్కున్నంక కూడ గిట్ల రాయక దప్తలేదు. గీ నడ్మ మీ నాయినకు దగ్గు, దమ్ము ఎక్వ అయ్యింది. ఒక్కోసారి అయితె గాయిన మాట్లాడెతందుకు గూడ తన్లాడుతున్నడు. ఎన్నిసార్లు నీకు కారట్లు కారట్లు ఏసినా గాయినను పట్నం దోల్కపోయి పెద్ద డాక్టర్‌కు సూపిస్తలేవు. కన్నకొడుకువి నువ్వు బట్టిచ్చుకోకబోయినా కట్టుకున్న నాకు దప్పదు గదా. గాయిన నీ గురించి ఏ తీర్గ తిప్పల బడ్డడో నీ కెక్కకలేనిది గాదు. పదిమైళ్ల దూరంల ఉన్న వూరికిసైకిల్ మీద బోయి కొల్వు జేసెటోడు. నీ సదువు గురించి ఎన్నో తిప్పలు పడ్డడు. శాతనైనా గాకున్నా నీ గురించి ఒక్క తీర్గ కస్టం జేసిండు. గాయిన ఇంతదాంక ఒక్కసిన్మ గూడ సూడలేదు. నీ గురించి నీ సద్వు గురించి గాయిన తన్లాడిండు... నువ్వు ఏది కావాలంటే అది దెచ్చి ఇచ్చిండు.... నీకోసం మీ నాయిన మోంబత్తి లెక్క కరిగిండు. ఈడ డాక్టర్‌కు సూబెడితె పిరమున్న మందులురాసి పొరన్ ఏసుకోమన్నడు. గా మందులు గొనెతందుకు మాతాన బుడ్డపైస గూడ లేదు. గీ కారట్ ముట్టంగనే ఆరొందల రూపాయలు బంపు. కోడలును అడిగినట్లు చెప్పు. మన్మనికి నా ముద్దులు. గాన్ని మంచిగ సదుకోమని నా దిక్కు కెల్లి చెప్పు. రూపాలు యాదిమర్సకంట బంపియ్. మీ నాయిన బాదను సూడశాతగాక గిట్ల రాస్తున్న. పండ్గకు కోడలును, మన్మన్ని దీస్కొని మన ఊరికి రా. జల్ది రూపాలు బంపియ్.

ఇట్లు
మీ అమ్మ యాదవ్వ

ఆ ఉత్తరం అందాక కూడా నేను మా తల్లిదండ్రులకు మనిఆర్డర్ పంపలేదు. అందుక్కారణం లేకపోలేదు. ఎప్పటినుంచో నా శ్రీమతి బంగారు గాజులు చేయించమని కోరుతున్నది. ఖర్చుల మూలంగా నేను ఆమె అడిగిన గాజులు కొనలేకపోయాను. దాంతో ఆమె నాపై అలిగింది. కొన్నిరోజులు కూరల్లో ఉప్పుకారం ఎక్కువ వేసింది. అయినా నేను సర్దుకుపోయాను. ఆమె నాతో మాట్లాడటం మానేసింది. వారం రోజులక్రితం వంట కూడా మానేసింది. ఆమె వంట మానేసిన రోజునే మా అమ్మ నుంచి నాకుత్తరం వచ్చింది. నా స్నేహితుడి వద్ద నుంచి అప్పు తీసుకుని బజారుకెళ్లాను. నా శ్రీమతి కోరిన బంగారు గాజుల్ని కొన్నాను. కొని ఆమె చేతికి తొడిగాను. దాంతో ఆమె మొహం వెలిగిపోయిందని వేరే చెప్పాలా.

హోటల్ నుంచి బయటకు వచ్చాను. వయసు బిచ్చగత్తె అందరినీ అడిగినట్లే నన్నూ బిచ్చమడిగింది. కానీ నేను ఆమెకు ఒక్క రూపాయి కూడా వేయలేదు. సరాసరి ముసలి బిచ్చగత్తె వద్దకు వెళ్లాను. ఆమె అల్యూమినియం గిన్నెలో ఐదురూపాయల నాణాన్ని వేశాను. ఆమెలో నాకు మా అమ్మ కనిపించింది. ఆమె నాకేసి ఆశ్చర్యంగా చూసి...

"పెండ్లాం పిల్లలతోని సల్లగ బతుకు బిడ్డా!" అంటూ దీవించింది.

■

